ఓం

# గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘపక్షమున ప్రకటింపబడు సచిత్రమాసపత్రిక.

౬వ సంపుటము] నవంబరు ౧౯౨౪ [౫వ సంచిక

సంపాదకుడు: అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయసూచిక


౧ మాతృసంకీర్తనము (కీర్తన) ౧౩౫

౨ పత్రికాపఠనము ౧౩౬

౩ ద్వితీయ అఖిలభారతగ్రంథాలయ ప్రతినిధులమహాసభ ,,

౪ అమెరికా గ్రంథాలయములు ౧౪౧

౫ ఆరవ గుంటూరుమండలగ్రంథాలయప్రతినిధుల మహాసభ ౧౪౨

౬ గ్రంథాలయములు ౧౪౩

౭ ధర్మగ్రంథాలయము—గ్రంథాలయపాలకుడు సిబ్బంది ౧౪౪

౮ శ్రీహనుమత్ పుస్తకభాండాగారము, కానుమోలు ౧౪౫

౯ భారతవర్ష గ్రంథాలయోద్యమము ౧౪౬

౧౦ శ్రీవేటపాలెము హిందూయువజనసంఘము ౧౪౭

౧౧ సంపాదకీయములు—అఖిలభారత గ్రంథాలయసభ, సంచారగ్రంథాలయములు; స్థానికసంఘములు ౧౪౮


---

వార్షికమూల్యము రు 3-0-0

విడిసంచిక వెల రు 0-4-0.

ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ, పమిడిపాడు.



RSVM01 A 1245





అధ్యక్షులగు

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు



ఆహ్వానసంఘాధ్యక్షులగు

శ్రీయుత బెల్లంకొండ రాఘవరావుగారు.

RSVDM01A.125
5



పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తి ఫలప్రదాం
ప్రణమ్య స్తౌమి తామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

ఆరవ సంపుటము.

# గ్రంథాలయ సర్వస్వము

ఐదవ సంచిక.

## మాతృసంకీర్తనము

పల్ల|| తల్లీ బంగారుతల్లీ | దయజూడవే, మా ||తల్లీ||

అనుప|| యుల్లమున నీపాద | పల్లవము లామోద
ముల్లసిల్ల నిల్పి | యుంటి గావుమంటి ||తల్లీ||

నీవంటితల్లి లేదు | నీకీర్తి కంతులేదు
నీవాక్కు లమృతములు | నీసేవ పావన మో ||తల్లీ||

పొంగుచు నేమేమి | పుణ్యముల జేసి నీ
బంగారుబొజ్జలోన | బవళించినాడ నో ||తల్లీ||

తేనెసోనలూరు | తియ్యని కైతలు
పూనికతో వ్రాసిన | పోతనాదికవులగన్న ||తల్లీ||

తళుకుకత్తులతోడ | కులుకు మోములతోడ
నలుక లున్నవారి | బిలుకుమార్చినబంట్ల ||తల్లీ||

బాస, దేశమ్ము వి | కాసముజెంద "సె
బా" సంచు బొగడంగ | బ్రజ నేలినదొరల ||తల్లీ||

వేడుకతో ప్రాణ | విత్తంబులన్నిటి
గూడియు దేశంబు | కోస మిచ్చినవారి ||తల్లీ||

వచ్చియడిగినవారి | బొచ్చెములేకను
మచ్చికగోరిన | దిచ్చిపంపినదొరల ||తల్లీ||

పచ్చని పైరిచ్చి | బాగైన నీరిచ్చి
        వెచ్చన జల్లనయు | ముచ్చటగ నిచ్చినట్టి ॥తల్లి॥
వసమించు తొలుకొండ | పైనున్న నీటిలో
        బసిడిగద్దెనున్న | భారతమాతరో ॥తల్లి॥

—తుమ్మల సీతారామమూర్తి చౌదరి.

## పత్రికాపఠనము

మ. ప్రతినిత్యమ్మును ప్రాలుమాలక యెవా ♦ ర్తాపత్రికల్ గాంచ నే
స్థితికిన్ దేశమువచ్చెనో ప్రముఖు లే♦ చేతల్ బొనర్పన్ మదిన్
గుతుకం బందెదరో యెఱుంగనగుటన్ ♦ గూపస్థమండూకవ
ద్గతికిన్ బాహ్యులమౌదు మట్లగుట యే♦తన్మాత్రమేఁ గాంచుఁడీ.

ఉ. మందుల మాటచే బయిసి ♦ మాలినవస్తువు లెన్నొ పంపి యు
క్తిం దగ మోసగించి పర♦దేశనివాసులు దేశవిత్తమున్
వందలు వేలు లక్షలు ప్ర♦వాహముగాఁ గొనఁదెల్ప దేశ మీ
చంద మధోగతిన్ గన వి♦షాదము నైన వహింప నౌనుగా॥

—ప్రతాప వేంకటేశ్వరకవి.

# ద్వితీయ అఖిల భారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

ఈ మహాసభ కాకినాడపట్టణ పురమందిరమున 1923 సం॥ డిశంబరు నెల 26, 27 తేదీలయందు అతి వైభవముగ జరిగినది. మద్రాసునందు ప్రథమసభ జరిగిన పిమ్మట, ద్వితీయసభ బరోడాయందు జరుగవలసి యుండెను. కాని అట్లు జరుగకుండుటచేత పమిడిపాడు నందుజరిగిన ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభచే తీర్మానింపబడిన ప్రకారము, ఈసభ కాకినాడ యందు సమకూర్చబడెను. 26వ తేదీ మధ్యాహ్నము 2 గంటలకు సభ ప్రారంభమాయెను. సభకు నిర్ణయింపబడిన కాలమునకు పూర్వమే సభాభవనమంతయు ప్రతినిధులతోను ప్రేక్షకులతోను క్రిక్కిరిసిపోయెను. వివిధ రాష్ట్రములనుండి వచ్చిన ప్రతినిధులు రమారమి 250 మంది గలరు. బరోడా, మైసూరు, పుదుక్కోట, సంస్థానములనుండియు, బొంబాయి విశ్వవిద్యాలయమునుండియు ఈ సభకు ప్రతినిధులు పంపబడిరి. ప్రార్థన జరిగిన పిమ్మట, ఆహ్వానసంఘాధ్యక్షులగు శ్రీ చెలికాని ధర్మారావు బార్-అట్-లా గారు తమ ఉపన్యాసమును గంభీరమగు వాక్కులతో ఈక్రిందిరీతిని ఒసంగియుండిరి.

### ఆహ్వాన సంఘాధ్యక్షుని ఉపన్యాసము

ఆహ్వానసంఘముపక్షమున మీకు స్వాగతమొసంగు భాగ్యము నాకు అబ్బినందులకు మిక్కిలిగర్వపడుచున్నాను. ఎనిమిదవ ఆంధ్రగ్రంథాలయ మహాసభలో జరిగిన తీర్మానానుసారముగా, కాకినాడలో ఈ సభ కూడుచున్నది. ఈసభకువచ్చిన ప్రతినిధులందరి కార్యదీక్షయు దేశాభిమానమును, ఈ సభను నిర్విఘ్నముగ జరుపగలుగును. మిక్కిలి విచారకరమగు కొన్ని ఆలోచనలు నా మనస్సును చీకాకుపరచుచున్నవి. ఈ ఉద్యమముతో అత్యంతమైన సంబంధముగల ప్రముఖులిద్దరు పరలోకగతులైరి. మొదటి అఖిలభారత గ్రంథాలయసభకు

అగ్రాసనాధిపతిగారగు కుడుహాల్కరుగారును ఆసభకు ఆహ్వానసంఘాధ్యక్షులగు కస్తూరి రంగఅయ్యంగారును మనలను విడచి స్వర్గస్థులైరి. వారు ఉభయులు మిక్కిలి కీర్తిమంతులు. వారినిపోగొట్టుకొనిన దుఃఖముతో మనము నిరుత్సాహులము కాగూడదు; అందుకు బదులుగా వారిమరణముచే గలిగిన లోపమునుకూడ దీర్చికొనుటకు ఇతోధిక ప్రయత్నములను మనముజరుపవలసియున్నది. కాకినాడకు అత్యంతసమీపమున నాప్రియసోదరులగు కావ్యనిధి చెలికాని లచ్చారావుగారుకూడ దివికేగిరి. వారికి మనయుద్యమమందు పట్టుదల కడుమెండు. వారి మరణమువలన గలిగినలోపము చులకనగా దీరునదిగాదు. మన మాతృభూమియెడల మనము నిర్వర్తించవలసిన విధులను మనము నెరవేర్చుటకు తగిన శక్తిని పరమేశ్వరుడు మనకొసంగుగాక!

సామాన్యముగా విద్యాభివృద్ధినిగూర్చియు, అందు ప్రాముఖ్యముగా గ్రంథాలయోద్యమమును గూర్చియు కొద్దివిషయములను మీయెదుట మనవి జేయుచున్నాను. మనదేశాభివృద్ధిని గోరువారందరు ఆలోచించుచున్న రాజకీయ ఆర్థిక సాంఘిక మతవిషయిక సమస్యలన్నియు ప్రజలయందు జ్ఞానమును వ్యాపింపజేయుటచే నెరవేరగలవని ఎంచతగియున్నది. ప్రతిమనుజుడును తనయొక్క శక్తిని, దాని అభావమును గుర్తించి తనమనోభీష్టము సిద్ధినిబొందుకొరకు ఏయేవిధానము అవలంబించవలయునో దానినంతిగు జ్ఞానజ్యోతి ద్యోతకముజేయును. ప్రతిమనుజుడును తనవాంఛలను ఆకలిదప్పులవలెనే తీవ్రముగ అనుభవములోనికి తెచ్చుకొన్నగాని వాంఛితఫలసిద్ధి పొందనేరడు.

మనము ఉపదేశించువిద్య జాతీయపద్ధతి నవలంబించియుండవలెను. ప్రతిజాతియు, నిర్దిష్టమగు ఆదర్శసిద్ధికై కృషి చేయుచున్నది. ప్రాచ్య పాశ్చాత్య ప్రాప్యములలో భేదము చాలగలదు. అందువలననే పాశ్చాత్యపద్ధతుల నవలంబించి మన పాఠశాలలలో బోధించెడి విద్య మనకు ఈప్సితఫలమును ఇచ్చుటలేదు. చిరకాలాభ్యాసమువలన భారతీయుల మానసిక నైతికతత్వమునందు తృప్తి, ఆడంబరములేని జీవితము, ఆత్మసమర్పణము చేయుధర్మము, త్యాగమునకులోబడజేసిన భోగము — సంపూర్ణముగ లీనమైపోయినవి. ఈతత్వమును గ్రహించక ఇందుకు వ్యతిరేకమగు సూత్రముల ననుసరించి నిర్మాణముచేయబడు విద్యాభ్యాసవిధానమంతయు మనదేశమునకు విజాతీయమైన దగుటచే గుంటపూవుల పూయవలసినదే. కాని ఎన్నటికిని అభివృద్ధిని గాంచనేరదు. ఇంతటితో మనము అన్నిటియందును సంపూర్ణత్వమును పొందియుంటిమనియు, ఇతరులవలన నేర్చుకొనవలసిన విషయములు లేనేలేవనియు నేనుచెప్పుటలేదు. ఇతరులవలన నేర్చుకొని తీర్చుకొనవలసిన లోపము లనేకములు మనకుకలవు. మనకు నిర్మాణశక్తి బహుతక్కువ. పాశ్చాత్యులను జూచి, మన విధులను సక్రమముగా నెరవేర్చుకొనుదీక్ష మనము నేర్చుకొనవలసియున్నది. ఇట్లు నేర్చుకొను విషయములయందుగూడ మన జాతీయవ్యక్తిత్వమును మనము మరువ గూడదు.

కేవలము కళాశాలాభవనములు మొదలగువానిని నిర్మించుటకును, వానికి తగుపరికరములను చేర్చుటకును ఐశ్వర్యముతో తులదూగుచున్న పాశ్చాత్యదేశములందు మిక్కుటముగ ద్రవ్యము వెచ్చింపబడుచున్నట్లు మన బీదదేశమందు సొమ్ము వ్యయపెట్టలేము. పాశ్చాత్యదేశములలో తప్పనిసరిగా ఉండతీరవలెనను ఎన్నియోవస్తువులు మనదేశమున కేవలవైభవమునకు సంబంధించినవైయున్నవి. ఈవైభవములు శరీరమును సున్నితపరచి, జీవితమును హ్రస్వముజేయును. ఇప్పటి విద్యార్థులు పూర్వపువారికంటె ఎన్నియోమడుంగులు బలహీనులు. గ్రంథాలయములు స్థాపించుటయందు ఈ విషయములనన్నింటిని మనము మనస్సునం దుంచుకొనవలయును.

గ్రంథాలయనిర్మాణము మనదేశమునకు క్రొత్తది గాదు. కాశీ మొదలగు పుణ్యక్షేత్రములందును, మఠములయందును ఆశ్రమములందును నెలకొల్పబడియున్న గ్రంథసమితులు ఆధునిక గ్రంథాలయములవంటివే. పరిస్థితులు మారినవి ప్రజలయందు జ్ఞానము ఎక్కువదట్టముగా వ్యాపించుటకుగాను పాశ్చాత్యపద్ధతులను కొన్నింటిని మనము అనుకరింపవలెను. ఎక్కువసొమ్మును వెచ్చించి పెద్దభవనములను, మనస్సును వ్యామోహము చెందించి కర్రసామానులను, సేకరించుటయందు ద్రవ్యము దుర్వినియోగము చేయక తగుద్రవ్యమును ఉచితరీతిని వ్యయపెట్టి గ్రంథాలయస్థాపనము మనము చేయవలయును.

మిక్కిలి విజ్ఞానవంతులగు బరోడా గాయక్వారుగారు, కీర్తిశేషులగు కులాల్కరుగారివంటి కార్యదీక్షాపరులసహాయముతో ప్రారంభ ఉచితవిద్యమూలమునను, గ్రంథాలయస్థాపన మూలమునను, ఆయనరాజ్యమున ప్రజలకు జ్ఞానాభివృద్ధిచేయుటకు అత్యుత్తమములగు సాధనములను అవలంబించియున్నారు. మైసూరు, తిరువాన్కూరు మున్నగు ఇతర స్వదేశసంస్థానాధిపతులుగూడ

గాయక్వారుగారిని అనుకరించి తమతమ దేశములందు నిరక్షరకుక్షుల సంఖ్యను తగ్గించి ప్రజలయందు జ్ఞానాభిలాషను అభివృద్ధి జెందించుచున్నారు. అక్కడప్రజలకును రాజులకును విరుద్ధప్రయోజనములేదు. కావున మనకు అంతరాయములుగానున్న కొన్నిప్రతిబంధకములు వారికి లేకుండుటచే అచ్చట ఈయుద్యమము ఎక్కువసుకరముగా వ్యాప్తిజెందుటకు సావకాశములున్నవి.


ఆంధ్రదేశమున బెజవాడపట్టణము గ్రంథాలయోద్యమమును అభివృద్ధికి దెచ్చుటకు నిరంతర కృషిసలుపుచున్నది. మద్రాసునందు జరిగిన ప్రథమ అఖిలభారత గ్రంథాలయ సభయందు ఆంధ్రదేశమున ఇందునుగూర్చి చేయబడుచున్న కృషియు, అందు ముఖ్యముగ శ్రీసూరి వేంకట నరసింహశాస్త్రిగారి దేశసేవయు, మిక్కిలి పొగడ్తనుగాంచినవి.

దేశమునకు పల్లెలు పునాది. కావున పల్లెటూరు గ్రంథాలయములనుగూర్చి ఎక్కువ కృషిచేయవలసియున్నది. స్థానిక స్వపరిపాలక సంఘములు తమవిధ్యుక్తమగు ఈ పనిని నెరవేర్చినచో అంతయు సులువుగానేయుండును. ఈగ్రంథాలయముల అభివృద్ధిమీదనే స్వపరిపాలక సంఘముల అభివృద్ధిగూడ ఆధారపడియున్నది. ప్రజాసామాన్యము విద్యావంతులు కానియెడల తగిన ప్రతినిధులు ఈసంఘములకు ఎన్నుకొనబడరు. వోటర్లు అజ్ఞానులైనచో ఈ సంఘములుకూడ నిరర్థకములుగానే యుండును.

మూడునాలుగు గ్రామములవారుచేరి చందాలు వేసికొని, చిన్నగ్రంథాలయమును స్థాపించుకొనవచ్చును. ఇందుకు ముఖ్యముగా అచ్చటి విద్యావంతులు శ్రద్ధ తీసికొనవలెను. వీలైనయెడల నెలసరిజీత మిచ్చిగాని, వార్షికముగా ధాన్యము నిచ్చిగాని, ఒక గ్రంథభాండాగారికుని నియమించుట ఉచితము. కొద్దికాలము క్రిందటివరకు ఈపద్ధతిని అవలంబించి ఉపాధ్యాయులు నియమింపబడు చుండిరి. అప్పటివారు ఇప్పటివారికంటె ఎక్కువ సమర్థులైయుండిరి. వీలైనంతవరకు దేశభాషయందు ప్రచురింపబడు పత్రికలను తెప్పించి పఠనమందిరమునుగూడ స్థాపింపవలెను. స్థానిక పాఠశాల ఉపాధ్యాయుల సహాయముతో ప్రజలను జ్ఞానవంతులుగాజేయుటకు గ్రంథాలయములును, పఠనమందిరములును ఎన్నియోవిధముల ఉపకరింపగలవు. పాటకపుజనుల ఉపయోగముకొరకు రాత్రిపాఠశాలలు స్థాపింపవలయును. ప్రకృతిశాస్త్రరహస్యములను తెలిపుచ్చుటకును, వర్తమానపరిస్థితులను దెలుపుటకును, తరుచు ఉపన్యాసములను జరుపుచుండవలయును. ఈ సంస్థలకు అనుబంధముగ పంచాయతీకోర్టుల నేర్పరచి వ్యాజ్యములసంఖ్య తగ్గింపవలెను. పల్లెటూళ్ల గ్రంథాలయములు అచ్చటచ్చటి ప్రజలకుచేయగల మహోపకారములు అనంతములు. స్థానికులగు దేశాభిమానుల కార్యదీక్ష ఎంతవరకు విజృంభించిన ఈసంస్థలవలన కలిగెడి లాభము అంతయెక్కువగా వృద్ధిజెందగలదు. ఇట్లు ప్రవర్తించినచో గృహకల్లోలములు, పల్లెటూళ్ళ తగాయిదాలు రచ్చకెక్కనగాని తీరవను తగవులుకూడ అనుకూలముగ పరిసమాప్తి నొందగలవు. పురాణకాలక్షేపములు, హరికథలుకూడ గ్రంథాలయముల యాజమాన్యమున జరుపవచ్చును.

ఈవిధముగ ఒకజిల్లాయందు స్థాపింపబడిన గ్రంథాలయములన్నియుచేరి, జిల్లాగ్రంథాలయమును నిర్మాణముచేసి దానికి అనుబంధముగా చేరవచ్చును. అవసరమైనచో ఒకేజిల్లాయందు రెండుమూడు కేంద్రగ్రంథాలయములుకూడ ఉండవచ్చును. ఈజిల్లా గ్రంథాలయములు స్థానికముగా చేయవలసినపనియేగాక, జిల్లాయందలి గ్రంథాలయములన్నింటిని అన్యోన్యాశ్రయములుగజేసి, అన్నిసంస్థలు చేయుపనిని ఏకముఖమునకు ప్రసరించునట్లు చేయవలయును. దేశాభిమానులగు లక్షాధికారులును, భూస్వాములును, దేవాలయధర్మకర్తలును, ధర్మాదాయ ధర్మకర్తలునుకూడ ఈ ఉద్యమమునకు తగు సహాయముచేయునట్లు వారలను ప్రార్థించవలయును. ధనసంపత్తి యున్నచో మోటారుసహాయమున ప్రజలకు జ్ఞానాభివృద్ధిచేయుటకు సంచారప్రవర్తకుల నేర్పరచవచ్చును. ఆరోగ్యము, రాజకీయపరిస్థితులు మొదలగు విషయములనుగూర్చి సులభశైలిని కరపత్రములు ప్రచురించి గ్రంథాలయములమూలమున దేశమున వ్యాపింపజేయవలయును. ఈజిల్లా గ్రంథాలయములపైన రాష్ట్రముల రాజధానిపట్టణములందు స్థాపింపబడెడు రాష్ట్రీయగ్రంథాలయము లుండవలెను. ఈరాష్ట్రములన్నియు భాషాప్రయుక్తముగా నుండవలయును ఈ రాష్ట్రీయగ్రంథాలయములు రాష్ట్రభాషయందు కరపత్రములను ప్రచురించవలెను. ఇంగ్లీషునందుండు అమూల్యములగు గ్రంథములు కొన్నింటిని తర్జుమా చేయించి సరసమగు ధరలకు గ్రంథాలయములకు పంచిపెట్టుట ఉచితము.

అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ, కాకినాడ.



ప్రతినిధులు.

సంపూర్ణమగు కేంద్రీకరణము ఎప్పటికిని పనికిరాదు. పల్లెటూరి గ్రంథాలయములకును జిల్లాగ్రంథాలయములకును వీలగువరకు తమవ్యక్తిత్వమును స్వేచ్ఛగా అభివృద్ధినొందించుటకు తగుసావకాశము లుండితీరవలెను. భేదములేని సంపూర్ణఐక్యతయందు ఎప్పుడును సౌందర్యము ఉండనేరదు. మనదేశపుమతముయొక్క ముఖ్యసిద్ధాంతమిదియేను.

రాష్ట్రీయగ్రంథాలయసంఘము లన్నిటిని, సమ్మేళనముజేయు అఖిలభారత సంఘమొకటి ఉండితీరవలెను. ఇట్టిసంఘము 1919 సం|| న జరిగిన మదరాసు సభలో నిర్మాణము చేయబడినది. ఇంకను ఈ సంఘముపని ప్రారంభించలేదు. ఈసంఘనిర్మాణముతో, హిందూదేశీయమహాసభతోబాటు గ్రంథాలయోద్యమమునకు గూడ అంగస్థాపనము సంపూర్ణముగ ఏర్పడుచున్నది. దేశమునందు నలుదిక్కుల స్థాపించబడియున్న గ్రంథాలయములతో పనిజేయవలసివచ్చినప్పుడు కొన్నికష్టములు లటస్థింపవచ్చును. అయితే నిజమైనఆనందము కష్టములు నివారణచేసికొన్నప్పుడు కలుగునుకాని, నివారణచేసికొనవలసినకష్టములు లేనప్పుడు ఎన్నటికిని కలుగనేరదు.

మనదేశమున అన్నిదిక్కులను, అన్నిశాఖలయందును, జాతీయప్రబోధము గలిగియున్నది. రాజకీయ సాంఘిక మతవిషయక స్వేచ్ఛను ప్రజలు మిక్కిలి వాంఛించుచున్నారు. ఈ అన్ని ఉద్యమములును, మనఉద్యమము విరోధమైన దెన్నటికినికాదు. ఈ అన్ని ఉద్యమములకును మనఉద్యమము సహాయముచేయునదిగా వర్థిల్లుచున్నది. ప్రజాసామాన్యమునకు విద్యాదానముచేసి, ప్రజలయందు దట్టముగా వ్యాపించియున్న అజ్ఞానతిమిరమును జ్ఞానతేజస్సుచే తరుమగొట్టుటయే మనపరమప్రాప్యము.

సోదరప్రతినిధులారా! నా వాంఛలను, నాఉద్దేశ్యములను మీకు ధారాళముగా నివేదించితిని. దేశారాధనతత్పరులగు విద్యాధికబృందముతో ఈసభ నిండియున్నది. నేను నివేదించినదానిలో ఎంతవరకు ఆచరణీయమో నిర్ణయించుట మీ విధ్యుక్తధర్మము.

* * * *

ఆహ్వానసంఘాధ్యక్షుల యుపన్యాసాంతమున ఆంధ్రభీష్ములనదగు మహారాజశ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు. బొంబాయినగరవాస్తవ్యులును, శాసనసభాసభ్యులును బారిష్టరును అగు ఎమ్. ఆర్. జయకరుగారిని సభకు అధ్యక్షులుగా ఉపపాదించిరి. ఈ ఉపపాదన తగువిధముగా బలపర్చబడినపిదప అధ్యక్షులు సభ్యుల కరతాళధ్వనులు మిన్నుముట్ట సభాధిపత్యము వహించి అనర్గళవాగ్ధోరణితో ఆకుపుగా నాఆంగ్లమున నుపన్యసించిరి. అందునుండి యీక్రిందిముఖ్యాంశములు గ్రహింపబడినవి.

## అధ్యక్షుని ఉపన్యాసము.

"కడచిన పదిసంవత్సరముల పైకాలమునుండియు ఎక్కువ కట్టుదిట్టములతో దేశాభివృద్ధికై కృషిచేయుచున్న ఆంధ్రగ్రంథాలయోద్యమాభివృద్ధిని స్వయముగా కనుగొనుసావకాశము ఇప్పుడు నాకు కలిగినందులకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. నేను ఆంధ్రదేశమును చూచిన కొద్దికాలములోను ఇచ్చటి పల్లెటూళ్లు పురాతనపుసౌందర్యమును విడలేదనియు, మహారాష్ట్రదేశమందువలెగాక ఇప్పటికిని పరిశుభ్రముగ నున్నవని నేను కనుగొంటిని. మలేరియా సూక్ష్మజీవులను నాశనముచేయుచున్నామను మిషతో ప్రభుత్వమువారు మహారాష్ట్రదేశమున పురాతనసరోవరములను పూడ్చివేసిరి. ఇందువలన మా పల్లెటూళ్లలో చెరువులు లేనేలేవు. ఉన్న కొద్దివియైనను మంచిస్థితిలోలేవు. పల్లెటూళ్ల గ్రామకంఠములు నిర్మానుష్యముగను అపరిశుభ్రముగనునున్నవి. ఆంధ్రులు పురాతనసంస్థలను నాశనము నొందించువారుగాక తమ జాతియొక్క వ్యక్తిత్వమును, ధారావాహికపరిజ్ఞానమును తమ విజ్ఞానమందును, తమ ప్రతిష్ఠాపనలయందును బాగుగా కాపాడుకొనియున్నారు. ఆంధ్రులజాతియొక్క వ్యక్తిత్వమున కనుగుణ్యముగ ఆంధ్రగ్రంథాలయోద్యమముకూడ పురాతనసంస్థలయందుత్తమమగు విషయముల నెల్ల సంరక్షించుకొనియు నూతనసంస్థలలో అవసరమగువానినెల్ల సంగ్రహించియు నిర్మాణమైనది. సామాన్యముగా ఆంధ్రగ్రంథాలయము కేవల పుస్తకనిక్షేపమేగాక రాజకీయ, సాంఘిక, నైతిక, మతవిషయికము మొదలగు జానపదుల ఉత్తమవ్యవస్థలకు సంబంధించిన అన్నివిధములగు కృషియు జరిగెడు కేంద్రస్థానముగా విరాజిల్లుచున్నది. కొన్ని గ్రంథాలయములు పోటీపరీక్షలు జరిపి ఉత్తీర్ణులగువారికి బహుమతు లొసంగును. కొన్నిటి యాజమాన్యమున పాఠశాలలు నిర్వహింపబడుచుండును. కొన్ని సంఘములు సాంఘికసేవ చేయును. ఇప్పుడు భారతదేశము నెదుర్కొన్న సమస్యలలో పల్లెటూళ్లను బాగుపర్చెడి సమస్య అగ్రస్థానము నధిష్ఠించియున్నది. ఈసమస్యను అనుకూలముగా పరిష్కరించుటకు ఆంధ్రగ్రంథాలయోద్యమము పూనియున్నది. హిందూదేశమంత్రి ఒకరు ఇదివరలో చెప్పినట్లు ఇంతవరకును భారతీయులు వెనుక

బండ్లులేని కేవలము ఇంజన్లుమాత్రమే అయియున్నారు. ఇప్పుడు ఆస్థితి మారినది. పల్లెటూళ్లలో పౌరజీవనము సుస్థాపితమైనగాని స్వపరిపాలనకు సరియైనపునాది యుండనేరదని సంపూర్ణముగా గ్రహింపబడినది. ఆంధ్రగ్రంథాలయోద్యమపక్షమున మహారాజశ్రీ సూరి వేంకటనరసింహశాస్త్రిగారు చేయుచున్నకృషి మిక్కిలి ప్రశంసనీయము. ఆంధ్రులు తమరాష్ట్రములో గ్రంథాలయోద్యమమును వ్యాప్తిచెందించుటతో తృప్తినొందరాదు, ఇతర రాష్ట్రములలో ఇట్టి ప్రాప్యములతోనే స్థాపింపబడి వర్ధిల్లుచున్న సంస్థాపనలుండియున్నవి. మహారాష్ట్ర దేశమున గ్రంథాలయోద్యమ ప్రచారకులందరు రెండు సంవత్సరముల క్రిందట సభలోకూడి ఆసభకు నన్ను అగ్రసనాధిపతిగా చేసిరి. అచ్చట ఒక కేంద్రసంఘమేర్పడినది, దాని కనుబంధముగ 120 గ్రంథాలయములు చేరియున్నవి. వివిధరాష్ట్రముల యందలి యుద్యమమును సమ్మేళనచేయుటకు అఖిలభారత కేంద్రగ్రంథాలయ సంఘమొకటి యుండవలెను. ఇందుకు చిత్తుచట్టములు ప్రథమ అఖిలభారత గ్రంథాలయసభలో చేయబడిన తీర్మానమునను సరించి తయారుచేయబడినది. వీనిని అంగీకరించవచ్చును. పాశ్చాత్య దేశములలోనున్న పెద్దగ్రంథాలయములలో, అందులో ముఖ్యముగా ఇంగ్లండు దేశమందున్న బ్రిటిషు మ్యూజియముయొక్క అత్యంతాభివృద్ధికి ముఖ్యసాధనము ఆయాదేశములలో నున్న కాపీరైటు ఆక్టులు. మనదేశమందుకూడ అనుకూలపరిస్థితులేర్పడినపుడు ఆట్టిచట్టములు చేయవలసియున్నది.

## ఉపన్యాసములు

అధ్యక్షుని ఉపన్యాసము పూర్తిఅయినపిమ్మట బరోడా సంస్థానమందలి గ్రంథాలయోద్యమాభివృద్ధినిగూర్చి ఎమ్. ఎన్. అమీనుగారును, మైసూరు సంస్థానమందలి గ్రంథాలయోద్యమమును గూర్చి వె. వి. చంద్రశేఖరయ్యగారు, పుదుక్కోట సంస్థానపు ఉద్యమమును గూర్చి ఎ. ఎస్. ముత్తుకృష్ణన్ గారును హైద్రాబాదు సంస్థానమందలి ఆంధ్రప్రాంతపు గ్రంథాలయాభివృద్ధిని గూర్చి కంభంపాటి అన్నప్ప శాస్త్రిగారును మహారాష్ట్రదేశమందలి గ్రంథాలయోద్యమమును గూర్చి వి. వి. ఘుణేకర్ గారును ఉపన్యసించిరి.

గంజాంజిల్లా గొలజాం గ్రంథాలయ కార్యదర్శి తూర్పాటి సన్యాసమ్మగారు "ఆంధ్రగ్రంథాలయము" అను విషయమునుగూర్చి సప్రమాణముగా అనర్గళధారతో ఉపన్యసించిరి. శ్రీయుత శనగపల్లి రామస్వామిగుప్తగారు ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమమును గూర్చి యుపన్యసించిరి. ఇంతటితో ఆనాటిసభ సమాప్తమైనది.

ప్రతినిధులందరు విషయనిర్ణయిక సంఘముగా చేరి చిత్తుతీర్మానములను చర్చించి నిరూపణచేసిరి. 27 తేదీ ఉదయం $8\frac{1}{2}$ గంటలకు సభకూడినది. గ్రంథాలయోద్యమముయొక్క వివిధశాఖలనుగూర్చి విద్యాధికులు ఉపన్యాసము చదివిరి. కీర్తిశేషులగు శ్రీ చెలికాని లచ్చారావుగారి అకాలమరణమునకు వగచుచు ఆంధ్రపరిశోధక మండలి గ్రంథభాండాగారికులగు కేశవరపు రామకృష్ణశాస్త్రిగారును, జనమంచి సీతారామయ్యగారును జాలికరమగు పద్యములను గానము చేసిరి.

27 వ తేది సాయంత్రం తిరిగిసభకూడి ఈక్రింది తీర్మానములను అంగీకరించెను:—

## తీర్మానములు

I ప్రథమ అఖిలభారత గ్రంథాలయసభకు అధ్యక్షులుగానున్న జనార్దనకుడల్కరు గారును ఆహ్వానసంఘాధ్యక్షులగు శ్రీమాన్ కస్తూరిరంగయ్యంగారును స్వర్గస్థులగుటచే సామాన్యముగా భారతభూమికి, అందుప్రత్యేకముగ గ్రంథాలయోద్యమమునకును, కల్గిన తీరనిలోపము ఈ సభవారు స్మరించుచు వారియాత్మలకు శాంతినొసంగవలెనని పరమేశ్వరుని ప్రార్థించుచున్నారు.

II కీర్తిశేషులగు కొమర్రాజు లక్ష్మణరావుగారు, చెలికాని లచ్చారావుగారు, వంగూరు సుబ్బారావుగారును ఆంధ్రదేశాభ్యుదయముకొరకును, అందు ప్రాముఖ్యముగా గ్రంథాలయోద్యమాభివృద్ధికొరకును నిరంతరకృషి జరుపుచు పిన్నవయస్సులో స్వర్గస్థులైనందుకు ఈసభవారు వగచుచున్నారు.

III ప్రథమ అఖిలభారత గ్రంథాలయసభలో జరిగిన తీర్మానము ననుసరించి అఖిలభారతగ్రంథాలయ సంఘము నడుపుటకు చేయబడిన నియమావళిని పరిశీలించి అంగీకరించడమైనది.

IV అఖిలభారతదేశమందంతటను గ్రంథాలయములు వ్యాప్తినొందించుటకుగాను ఉద్యమాభిమానులందరును ఆయారాష్ట్రములయందును, జిల్లాలయందును రాష్ట్రీయమండల గ్రంథాలయసంఘములను స్థాపించి వానిని అన్యోన్యసహాయకములుగా చేయుటకు ఈసభవారు హెచ్చరించుచున్నారు.

V స్థానికస్వపరిపాలనాసంఘములును, స్వదేశ సంస్థానములును దేవాదాయ ధర్మాదాయసంస్థల ధర్మ

కర్తలును పౌరగ్రంథాలయములను ధర్మముగా స్థాపించుటకును, ఇదివరకు పనిచేయు గ్రంథాలయముల కగు ఖర్చులో అధమము సగమువరకు భరించుటకును ఈసభవారు ప్రార్థించుచున్నారు.

VI గ్రంథాలయాధికారులు తమవద్దగల ముద్రిత, అముద్రిత గ్రంథములను పండితుల ఉపయోగము నిమిత్తము ఎరువిచ్చుటకు తగు సదుపాయములను చేయవలయును.

VII గ్రంథాలయములకు సంబంధించిన విద్యయందు నిపుణులగువారి యాజమాన్యముక్రింద, గ్రంథాలయ పాఠశాలలను స్థాపింపవలెనని హిందూదేశమందలి విశ్వవిద్యాలయము యొక్కయు, రాష్ట్రప్రధాన నగరములయందున్న పెద్దగ్రంథాలయముల యొక్కయు అధిపతులను ఈసభవారు కోరుచున్నారు.

VIII ట్రెయినింగు పాఠశాలలందును, కాలేజీలయందును జాతీయపాఠశాలలందును, సెకండరీస్కూలు లీవింగుసర్టిఫికెట్టుక్లాసు నందును, గ్రంథాలయశాస్త్రమును గూడ అభ్యసింపదగిన విషయముగా ఏర్పరచవలెనని ఈసభవారు కోరుచున్నారు.

IX లిఖితగ్రంథములును, శాసనములును, స్థానిక కథలును, ఏలపాటలును, జాతియొక్క విజ్ఞానమును భద్రపరచిన నిక్షేపములు గాన గ్రంథాలయములు వీని నన్నిటిని సేకరించి గ్రంథాలయములయందు సంగ్రహించి యుంచవలసినదని గ్రంథాలయోద్యమాభిమానులను ఈసభవారు హెచ్చరించుచున్నారు.

X గ్రంథాలయోద్యమమునకు సహాయము చేసిన శ్రీయుత కంచుమర్తి చంద్రరావుగారు మొదలగువారికి ఈ సభవారు తమవందనము లర్పించుచున్నారు.

XI వార్తాపత్రికలయొక్కయు గ్రంథములయొక్కయు ప్రకాశకులను గ్రంథాలయములకు సులభమగు ఖరీదులకు గ్రంథములును వార్తాపత్రికలును లభించునట్లు సదుపాయము చేయుటకు ఈసభవారు ప్రార్థించుచున్నారు.

అంతట సభాధ్యక్షులకు వందనము లర్పింపబడెను. అధ్యక్షులు తమ అంత్యోపన్యాసములో తాము సభకు అధ్యక్షపదవి నలంకరించినందులకు మిక్కిలి సంతసించితిమనియు తాము కాకినాడలో ఉన్నకాలములో తమకు సౌకర్యములను సమకూర్చిన ఆహ్వానసంఘమువారు, అందులో ముఖ్యముగా కోశాధ్యక్షుడగు గమిని శ్రీరాములుగారు మిక్కిలి వందనీయులని సెలవిచ్చిరి. మూడవ సభను బొంబాయిరాజధానికి అధ్యక్షులు ఆహ్వానము చేసిరి. సభవా రంగీకరించిరి. వివిధరాష్ట్రములనుండివచ్చిన ప్రతినిధులును ఆహ్వానసంఘమువారికిని స్వచ్ఛందసేవకులకును వందనములను సమర్పించిరి.

# అమెరికా గ్రంథాలయములు

(శ్రీ మాగంటి బాపినీడుగారు అమెరికా దేశమునందున్నప్పుడు వారు వ్రాసిన ఒకయుత్తరమునుండి ఈక్రింది విషయములు సంగ్రహింపబడినవి.)

నాకు సావకాశ మున్నప్పుడెల్ల నేనుపోయిన గ్రామమందున్న గ్రంథాలయమును దర్శించి గ్రహింపవలసిన విషయములను గ్రహించుట నాయాచారము. మొదట గ్రంథభాండాగారి నామమును దెలిసికొని, నేను భారతవర్షమునుండి విద్యాభ్యాసమునకై వచ్చిన విద్యార్థిననియు గ్రంథాలయమును గూర్చి విశేషములను దెలిసికొన వాంఛింతుననియు చెప్పెదను. అమెరికాదేశీయుల మానసికస్థితి మిక్కిలి తమాషాఅయినది. వారిదేశము వచ్చుటయు, వారిపద్ధతులను తెలిసికొనవలెనని ఆతురతచూపుటయు, వారికెక్కువ ఇష్టము.

ఆంధ్రదేశమునందున్న గ్రంథాలయములు సేయు సాంఘికసేవ, బాలభటోద్యమము, ఇతర సాంఘికసారస్వత వ్యాసంగములనుగూర్చి నేను వారికి చెప్పునప్పుడు వారు మిక్కిలి ఆశ్చర్యమును బొందిరి. ఏలయనగా ప్రపంచములోకెల్ల అమెరికాదేశవాసులే గ్రంథాలయోద్యమమునందు అభివృద్ధినిగాంచినవారని వారితలంపైయున్నది

"కలిఫోర్నియా" రాజ్యమున రివర్‌సైడ్ పట్టణమందు కార్నీజీ గ్రంథాలయమున్నది. స్పెయిను దేశమునుండి మిషనరీలువచ్చి ప్రారంభమునం దీపట్టణమున

నివాసస్థులైరి. అందుచేత ఈగ్రంథాలయభవనము స్పెయిను దేశకళానైపుణ్యమును జాటురీతిని గట్టబడినది. ఈగ్రంథాలయము మొదట పదునెనిమిదవ శతాబ్దమున స్థాపింపబడినది. పిమ్మట ౧౭౪౯ సంవత్సరమున ధర్మగ్రంథాలయముగ జేయబడినది.

ప్రారంభమున సొమ్ము తక్కువగా నుండుటచే గ్రంథాలయభవనమున నాటకము నొకదానిని ప్రదర్శించి, రు 450 లు సంపాదించిరి. ఒకభవనమునందు వెనుకవైపు నగల రెండు చిన్నగదులు మాత్రము గ్రంథాలయమునకు ప్రత్యేకింపబడినవి. అప్పుడు పఠనమందిరము లేనేలేదు. గ్రంథాలయము వారమునందు మూడురోజులు మధ్యాహ్నమునను, ఒకదినము సాయంకాలమునను మాత్రము తెరువబడుచుండెను.

౧౯౦౧ సంవత్సరమున ఆండ్రూకార్నిజీగారు ఈ గ్రంథాలయమునకు నాలుగులక్షల రూపాయల విరాళమునియ్యగా, ఇంకను కొంత ఇతరసహాయముతో ప్రస్తుతమున్న సుందరమందిరము నిర్మింపబడినది.

ఈ గ్రంథాలయచరిత్రను మనదేశమందున్న కొన్ని గ్రంథాలయములచరిత్రతో పోల్చవచ్చును. ఇప్పుడు గొప్పవనకొను గ్రంథాలయములన్నియు మొదట అల్పారంభములతోనే బయలుదేరియుండును. ఈ గ్రంథాలయమందు తొంబదివేల గ్రంథములుగలవు. ౮౦ వార్తాపత్రికలు, ౨౦ మాసపత్రికలు వచ్చుచున్నవి. ప్రతిదినము అయిదువందలమంది చదువరులు ఈ గ్రంథాలయముయొక్క ఉపయోగమును పొందుచుండెదరు. ప్రతిదినమును తొమ్మిదివందల పుస్తకములను తమఇండ్లకు తీసికొనిపోవుచుండెదరు. ఈ గ్రామమునందున్న జనాభా ఇరవై వేలమంది మాత్రమేను.

ఈ గ్రంథాలయమున అపరూపపు గ్రంథములనేకములు కలవు. ప్రత్యేకశాస్త్రగ్రంథములును విశేషముగా కలవు. గ్రంథభాండాగారికులను తరబీతుచేయుటకు పాఠశాలనొకదానిని ఈ గ్రంథాలయమువారు నిర్వహించుచున్నారు.

# ఆరవ గుంటూరుమండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

## తీర్మానములు

(1) కడచిన సంవత్సరము ప్రజాప్రబోధమునకై విశేషముగా పాటుపడి శ్రీకృష్ణజన్మస్థానమున కేగిన గ్రంథాలయసోదరుల నందరిని ఈసభవారు అభినందించుచున్నారు.

(2) ముందుసంవత్సరము ఈమండలమున గ్రంథాలయోద్యమమును తీవ్రోత్సాహముతో వ్యాపింపజేయుటకు మండలప్రజల నందరిని ఈసభవారు హెచ్చరించుచున్నారు.

(3) గ్రంథాలయోద్యమవ్యాప్తికి మండలకేంద్రగ్రంథాలయస్థాపన మత్యవసరముగావున అందుకు వలయుప్రయత్నముల చేయుటకు మండలగ్రంథాలయసంఘమువారిని ఈసభవారు కోరుచున్నారు.

(4) మండలగ్రంథాలయసంఘపక్షమున జరుగుచుండిన కరపత్రప్రచురణము ఆంధ్రదేశగ్రంథాలయసంఘమువారు పూనుకొనినందున వారికి మండలపక్షమున అన్నివిధముల సాయముచేయవలెనని ఈసభవారు తీర్మానించుచున్నారు.

(5) మండలగ్రంథాలయసంఘముయొక్క కార్యనిర్వహణమునకు శాశ్వతనిధిని సమకూర్చి సంఘపక్షమున నొక సంచారకార్యదర్శిని నిర్వహించుచుండవలెనని ఈసభవారు తీర్మానించుచున్నారు.

(6) మండలములో గ్రంథాలయోద్యమమునకు సంపూర్ణమైన అంగనిర్మాణ మేర్పడుట అవసరముకావున ప్రతితాలూకాకును ప్రత్యేక తాలూకా గ్రంథాలయసంఘముల నేర్పరచి ప్రతిసంవత్సరము ఆయా తాలూకా గ్రంథాలయసభలు జరుపుచుండవలెననియు, దీనిని అమలులోనికి తెచ్చుటకు మండలగ్రంథాలయసంఘమువారు కృషిసల్పవలెననియు ఈసభవారు తీర్మానించుచున్నారు.

(7) క్రిందటి గ్రంథాలయసభలో "ఏలపాటల" విషయమై చేసిన తీర్మానానుసారము శ్రీయుత ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు చేసినకృషికి వారినీసభవారు అభినందించుచు సంపాదింపబడిన వాటిని అచ్చొత్తించుటకు తగు ఏర్పాటుచేయుటకు మండలగ్రంథాలయసంఘమువారిని హెచ్చరించుచున్నారు.

ఈసంవత్సరమునకు యీక్రింది కార్యనిర్వాహకవర్గ మెన్నుకోబడినది:—

అధ్యక్షులు:—ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారు.

ఉపాధ్యక్షులు:—(1) కుప్పా శ్రీరామశర్మగారు.
(2) నాగండ్ల కృష్ణయ్యగారు

ప్రధానకార్యదర్శి:—చట్టి నరసింహాచార్యులుగారు

సహాయకార్యదర్శులు:—(1) గుంటూరి నరసింహారావుగారు (గుంటూరు)
(2) పాతూరి వెంకటేశ్వర్లుగారు (ధూళిపూడిపోష్టు)
(3) పత్రి అనంతరావుగారు (నరసారావుపేట)

కార్యనిర్వాహకులు:—

1 పాలపర్తి నరసింహముగారు.
2 దిడుగు నరసింహారావుగారు.
3 ఊటుకూరి వెంకటసుబ్బారాయ శ్రేష్ఠిగారు.
4 శరణు రామస్వామిచౌదరిగారు, అమృతలూరు
5 టి. పి. ఆళ్వారుగారు (వంగోలు)
6 బెల్లంకొండ రాఘవరావుగారు.
7 గొల్లపూడి సీతారామశాస్త్రిగారు.
8 గోపాలుని రామలింగయ్యగారు.
9 పెరుమాళ్ళ శాయన్నశ్రేష్ఠిగారు, పల్నాడు.

ముందుసంవత్సరం సభను శ్రీ గోపాలుని రామలింగయ్యగారు ముప్పాళ్ళకు ఆహ్వానముచేసినందున అంగీకరించడమయినది.

# గ్రంథాలయములు

(అనుమకొండ శ్రీరాజరాజనరేంద్రాంధ్రభాషానిలయ ఏకోనవింశద్వార్షికోత్సవ అధ్యక్షులగు శ్రీ ఎ. వెంకటరమణయ్యగారి ఉపన్యాసమునుండి)

విద్యాభివృద్ధికిఁ బాఠశాలలుమాత్రము చాలవు. ఇతర సాధనము లావశ్యకము. సంఘమును సంస్కరించుటకు సంఘీభావ మేర్పడుటకు సాధనములన్నియు మనము సమకూర్పవలెను.

జనులందరును సంఘీభావము కలిగియుండుటకును, అన్యోన్యపరిచయము నభివృద్ధిచేసికొనుటకును, సమత్వమును సంపూర్ణముగఁ గలిగియుండిన ధర్మపఠనమందిరములు, గ్రంథాలయములు, వస్తుప్రదర్శనశాలలు మొదలగు వివిధసంఘములను ఇందుకు సాధనములుగ దేశమునందెల్లెడలను విరివిగా స్థాపింపవలెను. సకలజనులును ఎచ్చోటికి వివక్షతలేకుండ పోఁగలుగుదురో అట్టిస్థలమే సార్వజనికగ్రంథాలయము. విద్యాధిదేవతయగు సరస్వతీదేవికి జాతి, మత వివక్షతగాని, గొప్పతనము, బీదతనము అనుభేదబుద్ధిగాని ఎంతమాత్రమును లేదు. న్యాయవాదికానిండు, ఉపాధ్యాయుఁడు కానిండు, జాగీర్దారుడు కానిండు, వర్తకుడు కానిండు, ఇంకను ఎవరైన కానిండు- ఆమె పాదపద్మములసన్నిధిని మోకరించి జ్ఞానామృతమును తనివిదీరఁ గ్రోలవచ్చును. విజ్ఞానపిపాసను దీర్చుకొను నుద్దేశముతో చనుదెంచు బీదవానితో సరిగా కూర్చుండి చదువుకొనిన తనపరువు తక్కువగునని భాగ్యవంతు డెంతమాత్రమును భావింపరాదు. ఈ విశాలోద్దేశములను నెరవేర్చుటకు సంఘములను తగినంత పునాదిగలవిగ స్థాపింపవలెను. గ్రంథములను, పత్రికలను అన్నితరగతుల జనులయొక్క రుచులను కనిపెట్టి సమకూర్పవలయును. జనుల సాంఘికజీవనమునం దేకభాజనముగ పనిచేయవలెనని తలంచు సంఘము సార్థకమగుటకు ఈవిషయములందు నిష్పాక్షికముగ నుండవలెను. ఈవిధముగ ధర్మగ్రంథాలయములును, పఠనమందిరములును, ఒక గ్రామముయొక్కగాని, పట్టణముయొక్కగాని సర్వజనులకును ఉపయోగించు సాంఘికప్రతిష్ఠాపనలై వెలయవలయును.

జనులందరును ఒకచోట సమావేశమై పరస్పరము భావములను వెల్లడించుకొను ప్రాముఖ్యమును గణుతింప శక్యముకాదు. ఇట్లు సమావేశమగుటవలన మానవునిజీవితమును నడతను అంటియుండు స్వల్పములగు అనేకదుర్గుణములు తొలగును.

గ్రంథాలయము లుంచుస్థలములు మిక్కిలి రంజకములై హృదయాకర్షకములుగ నుండవలెను. సర్వసాధారణముగా జనులు పగలంతయు తమతమ వ్యాపారములను జూచుకొని సాయంసమయమునందు గ్రంథాలయమునకు

గాని పఠనమందిరమునకుఁగాని విచ్చేయుదురు. అందుచే అది బహిరంగ ప్రదేశమునందు గాలి విరివిగా వచ్చుట కనుకూలముగ నుండవలయును. దానిచుట్టును చెట్లను పెంచిన జనప్రియముగ నుండును. గ్రంథము లందరికిని సులభముగ లభించునట్లు చేయవలయును. గ్రంథభాండాగారికుఁడు చదువరుల రుచులను కనిపెట్టి ఎవరికి తగిన గ్రంథములను వారి కందఁజేయుచుండవలెను. అతఁడు ఉల్లాసవంతుడై మిక్కిలి రసజ్ఞుఁడుగ నుండవలెను. గ్రంథాలయమున కాతఁడు ప్రాణము. దానియొక్క సఫలతకు అతఁడే మూలము.

చదువుకొనగలిగినవారికి గ్రంథము లిచ్చునంతమాత్రమున నే గ్రంథాలయముయొక్క ధర్మము పూర్తి కాలేదు. దురదృష్టవశముచే మనదేశమునందు చదువుకొనజాలనివారు పురుషులయందే అనేకులు కలరు. అట్టివారిలో వయస్సుమీరినవారికి చదువుచెప్పుట మిక్కిలి కష్టమగు కార్యముకదా! కాని, వారిని జ్ఞానవంతులుగ జేయుట మనకు చేతనైనపనియు ధర్మమునునై యున్నది. గ్రంథాలయములందే గాక, వారు నివసించుచుండెడు గుడిసెలకు సహితముపోయి గ్రంథములను పత్రికలను జదివి బోధించి వారి జ్ఞాననేత్రము వికసించునట్లు చేయవలెను. అప్పుడె గ్రంథాలయముయొక్క ధర్మము పూర్ణముగ నెరవేఱినదని చెప్పవచ్చును.

స్త్రీలకును పిల్లలకును కావలసిన ఏర్పాటులు మన గ్రంథాలయములయందు లేవు. స్త్రీలు సాంఘికులుగ జేరుటకు సూత్ర మభ్యంతరములేదు. కాని వారికి కావలసిన ప్రత్యేకమగు ఏర్పాటులు లేనిది లాభమేమి? స్త్రీ మన గృహాధిదేవతగదా! అర్ధాంగలక్ష్మికదా! ఈ లక్ష్మీదేవతలను మనము నిరసింపఁదగునా? కావున, వారు గూడ అభివృద్ధి నొందుటకు కావలసిన ఏర్పాటులను జేయుట అత్యంతావశ్యకము. స్త్రీలందఱును గాఢాంధకారమున మునిగియున్నప్పుడు మనము చేయవలసినదేమన, చందాలేమియు తీసికొనకుండఁగనే స్త్రీలు చదువుకొనుటకు గ్రంథములను పత్రికలను వారి గృహములకు పంపు నేర్పాటులను ప్రతిగ్రంథాలయమును, ప్రతి పఠనమందిరమును చేయవలసియున్నది. ఈవిషయమున ఆంధ్రదేశమునఁగల కొన్ని గ్రంథాలయములవారు పరిశ్రమ చేయుచుండుట మిక్కిలి ప్రశంసనీయము. కావలసిన గ్రంథములను, పత్రికలను, ప్రతిదినమును వారికి అందఁజేయుచుండవలెను. విద్యావతులగు కొందఱు స్త్రీల నేర్పాటుచేసి వారిని గృహములకు పంపి, చదువుకొనజాలని స్త్రీలకు వారు చదివి వినిపించునట్లు ఏర్పాటు చేయవలెను.

పిల్లలుకూడ వచ్చుటకు మన గ్రంథాలయములయందు బొత్తిగా ఆకర్షణసాధనములు లేవు. స్వాభావికముగ జిజ్ఞాసను సంతృప్తి పరచుకొనుటకును జ్ఞానపిపాసను దీర్చుకొనుటకును పెద్దలకువలె పిల్లలకును గ్రంథములను పత్రికలును అత్యంతావశ్యకములు. పాశ్చాత్యదేశములయందెల్ల, అందును ముఖ్యముగా అమెరికాదేశమునందు, పిల్లలకు ప్రత్యేకగ్రంథములును, పత్రికలునుగూడ విశేషముగ గలవు. గ్రంథాలయములయందు వారు చదువుకొనుటకు ప్రత్యేకమందిరములును, వారికి బోధించుటకు ప్రత్యేకభాండాగారికులును కూడ కలరు. ఆదేశములయందున్న గ్రంథాలయములలో పిల్లలు చదువుకొనుటకు ఎన్నిసౌకర్యములు కలవో యూహించుటకైన మనకు సాధ్యముకాదు. అట్టి సౌకర్యములు మనదేశమునందు పెద్దలకుకూడ లేవు.

పైఁ జెప్పినరీతిని జనసామాన్యమునం దంతటను విద్య వ్యాపింపజేయుటయే గ్రంథాలయముయొక్క పరమావధి. కావున పాఠశాలలవలన జనులందరికి విద్య యబ్బకపోయినను, గ్రంథాలయోద్యమమువలన విద్యాభివృద్ధి యగుటకు అవకాశమున్నది.

# ధర్మగ్రంథాలయము

## గ్రంథాలయపాలకుడు - సిబ్బంది

బి. హెచ్. మెహతాగారు

(అనువాదకుడు:—యాతగిరి లక్ష్మీవేంకటరమణ)

గ్రంథాలయ పాలకుని నియమించుటలో ప్రతి గ్రంథాలయమువారును మిక్కిలి జాగరూకత వహింపవలెను. ఒకపక్షమునకు సంబంధించిన మనుజుని నియమించుటకు ప్రయత్నింపగూడదు. పాలకత్వమునకు తగిన మనుజునే నియమింపవలెను. ఈసూత్రము అన్నిదేశములకును, కాలములకును వర్తించును. అనేకమతములు, జాతులు, ఆచారములు కలిగిన ప్రజాసమూహముతో నిండిన మన హిందూదేశములోని ధర్మగ్రంథాలయము

నకు పాలకుని నియమించుటలో చాల కష్టమున్నది. గ్రంథాలయపాలకుడు కార్యనిర్వహణమందు సమర్థుడై యుండుటయేగాక యింకను కొన్ని సుగుణములను కలిగియుండవలెను. అతడవసరసమయములందును స్థలములందును మనస్ఫూర్తిగా పనిచేయు గుణమును, శక్తిని గలిగియుండవలెను. అతనికి భాషాభిమానమెంతయున్నను, ఎట్టి గొప్ప పరీక్షలలో కృతార్థుడైనను కార్యము లేదు. పైని పేర్కొనబడిన గుణములను కలిగియుండిననే కార్యకారి కాగలడు. ఆయన జాతిమతభేదములను పాటింపనివాడై సర్వమానవసమానత్వ తత్వము గలవాడై యుండవలెను. జాతిమతభేదములను గ్రంథాలయకార్యనిర్వహణమందు ప్రవేశపెట్టినయెడల గ్రంథాలయాభివృద్ధికి తప్పక భంగము కలుగును. చక్కని దస్తూరి వ్రాయుటకూడ పాలకుని కుండవలసిన ముఖ్యగుణములలో నొకటి. గ్రంథాలయ రికార్డును అచ్చువేయించి యుంచుట మేలుపద్ధతి. కాని ధనవ్యయమును అన్ని గ్రంథాలయములు భరించుట కష్టముగావున ఆదరణయోగ్యము కాదు. శాశ్వతరికార్డును టైపుచేయించుటకుగూడ వీలులేదు. ఏలన కొన్ని దినములకు అక్షరములు హరించిపోవును. కావున చేతితో వ్రాయుటయే యుత్తమమైన మార్గము. గ్రంథాలయమున రికార్డు తయారుచేయున దొకరైనను పెక్కురైనను అందరు నొకేమాదిరి దస్తూరి నవలంబింపవలెను. వ్రాయసకాడు రికార్డులోనుండి తాను వ్రాసిన భాగములను కనుపరుపలేనంత శ్రేష్ఠముగ వ్రాయవలెను. అమెరికా గ్రంథాలయములలో గ్రంథాలయదస్తూరియని పిలువబడు గుండ్రని నిలువుటక్షరములను వ్రాయుచున్నారు. గ్రంథాలయములోని వ్రాయసకాండ్రలో ముఖ్యముగా శాశ్వతరికార్డును తయారుచేయువారందరును తప్పక గ్రంథాలయదస్తూరి నవలంబించునట్లు నిక్కచ్చిచేయవలెను. గ్రంథాలయదస్తూరి వ్రాయనివారిని వ్రాయలేని వారిని నియమింపకుండుట యుత్తమమార్గము. గ్రంథాలయదస్తూరి నవలంబించుట విశేష కష్టకార్యము కాదు. కొలది యోర్మి వహించి వ్రాయుటకు ప్రయత్నించినయెడల దస్తూరి బాగులేనివారుకూడ గ్రంథాలయదస్తూరి బాగుగ వ్రాయగలరు. దీని ముఖ్యాభిప్రాయమేమన గ్రంథాలయ దస్తూరి అచ్చునకు మేనల్లునివలె నుండవలెను.

శ్రేష్ఠమైన పాలకుని నియమించిన పిమ్మట ఆయనకు మంచి జీతము నేర్పరచి క్రమాభివృద్ధి నొందునట్లు చూడవలెను. అప్పుడు కార్యసంఘమువా రతనిపై కొన్ని బాధ్యతలను మోపి తప్పులను సవరించుపద్ధతిని తగినంత స్వతంత్రము నొసగవలసి యున్నది. గ్రంథాలయమునకు గుమాస్తాల నేర్పరచు అవసరము కలిగినప్పుడు అట్టివారిని పాలకునితో సంప్రతించియే యేర్పరుపవలెను. తగిన కారణములను చూపుచు ఒకానొక వ్యక్తిని నియమింపగూడదని పాలకుడు అడ్డుపెట్టినయెడల అట్టి యాక్షేపణను కమిటీవారు తప్పక గమనింపవలెను. ఇట్టి యుద్యోగముల కన్నిటికి మామూలు షరతులతో రెండుమూడు వత్సరములకు తాత్కాలిక యేర్పాటులను గావింపవలెను. అవసరమునకు పనికి వచ్చుటకు కొంతనుండి జీతముతోనైనగాని లేకగాని ఉమేదువారీలను చేర్చుకొనుట లాభకరము. చిన్న గ్రంథాలయములకు అన్నిశాఖలకు కలిపి నిబంధనలను పాలకుడు తయారుచేసి కమిటీవారి యనుమతికి పంపవలెను. సహాయపాలకులుండు పెద్ద గ్రంథాలయములకు ప్రత్యేకశాఖలకు ప్రత్యేకనిబంధనలను తయారుచేయవలసి యున్నది. నిబంధనలను తయారుచేయుటలో నేమనుజుడేయే కార్యముల నొనరించుచుండవలెనో స్పష్టముగా వివరించి వ్రాయుట మేలు. వారికి కొంత స్వతంత్రము గూడ చూపనియెడల వ్యక్తినిర్ణయాధికారమునకు భంగము కలుగును.

# శ్రీహనుమత్ పుస్తకభాండాగారము, కానుమోలు

నూతనాభిలాషలు మానవుని యున్నతభావసందేశమును ప్రకటించుచుండును. ఏ దేశమయినను, ఏ సంఘమైనను, ఏవ్యక్తియైనను అభివృద్ధి నొందవలెననిన నిరంతరసేవాసక్తియు కష్టసహిష్ణుత కలిగియుండినగాని నిజస్వరూపమును గాంచలేరు. ఆంధ్రుల యుత్కృష్టాదర్శములు, పూర్వసాంప్రదాయములు పురాతనకాలమును డియు హిందూదేశమున యున్నతసందేశమును వినిపింపగలిగినవికాని వర్తమానపరిస్థితులు కాలప్రభావమువలన జాతీయధర్మమును విధిగా నెరవేర్చుటకు వెనుకడుగు వైచుచున్నవి. ఇందుకు బాధ్యతాబాధ్యత లెట్లైనున్నను ఆంధ్రదేశమున యిప్పుడు నూతనాభిలాషలు నిరంతరము భాషాసమాజములను, పత్రికాప్రచారసంఘములను, గ్రం

థాలయములను నెలకొల్పి సేవాస్వరూపమును బహిరంగముగా వెలువరించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి.

మా గ్రంథాలయము 1920 సంవత్సరము అక్టోబరు 18 వ తేదిన 300 ఆంధ్రగ్రంథములు, 100 ఆంగ్లేయభాషాగ్రంథములతో శ్రీ నందూరు వెంకటాచార్యులు, నూకల రామస్వామిగార్లచే నెలకొల్పబడి తదాదినుండియు గ్రామస్థుల అభిమాన ప్రోత్సాహములచే రు 1000-0-0 లు విలువచేయు గ్రంథరాజములను యితరపరికరములును, రు 100-0-0 లు మూలధనమును సముపార్జింపగలిగితిమి. దేశభక్తులును, మాతృభాషాసేవకులును అగు మా గ్రామస్థులు ప్రతిదినము యిరువదిమందికి తక్కువకాకుండా చదువరులు వచ్చుచుందురు.

—నూకల రామస్వామి,
కార్యదర్శి.

# భారతవర్ష గ్రంథాలయోద్యమము

సార్వజనిక గ్రంథాలయములు జాతీయవిద్యయొక్క ముఖ్యభాగమను విషయము చాలకాలము క్రిందటనే గ్రహించితిమి. సార్వజనిక గ్రంథాలయోద్యమము అన్ని రాష్ట్రములలోను స్వదేశ సంస్థానములలోను, పనిచేయుచున్నది. అందువలన దేశముయొక్క వివిధభాగములందు పని సలుపుచున్న గ్రంథాలయోద్యమములకు పరస్పర సంబంధము కలుగచేయవలయునను కోరిక యుదయుట స్వాభావికము. ఈవంక ప్రయత్నములు పెక్కుమార్లు జరిగినవి గాని సార్వజనిక గ్రంథాలయోద్యమమును దేశమంతటను వ్యాపించచేయుటకుగాను, విస్పష్టమైన సాధనములతోను, ఆదర్శములతోను కూడిన ప్రయత్నము సాగలేదు. యావద్భారత సంఘావశ్యకతనుగూర్చి మొదట సూచించినది ప్రభుత్వమువారు. అందుకు వారు మన కృతజ్ఞత కెంతయో పాత్రులు.

ఉద్దేశ్యము యెంత మహత్తరమైనను ప్రభుత్వమువారి యాజమాన్యముక్రింద జరుపబడుచున్న పెక్కు ఉద్యమములవలెనే సంకుచితరాజనీతిచే వారిందును గూర్చి చేసిన ప్రయత్నములవల్ల ఉపయోగము గాన్పించదయ్యె. వారేర్పరచిన మహాసభకు ప్రభుత్వమువారి ప్రతినిధులును, మరికొందరు స్వదేశసంస్థానములనుండి భాండాగారికులును మాత్రమే రానర్హులై యుండిరి. ప్రభుత్వమువారి గ్రంథాలయముల నిర్మాణముమాత్రము ఆసభయందు విచారణీయాంశముగ దృష్టియందుంచుకొనిరి. గ్రంథాలయోద్యమమును దేశమెల్లెడల నెట్లు వ్యాపింపచేయుట యను విషయమును ఒక రాష్ట్రీయ ప్రభుత్వమువారు సూచించినను వదలివైచి, దేశమంతటనుగల గ్రంథాలయములు అన్యోన్యాశ్రయమును కలిగియుండుట, కోరువారికి అన్నిగ్రంథాలయములును సహాయముచేయుట అను ఈరెండు ముఖ్యసూత్రములను గ్రంథాలయోద్యమ రంగమందు కృషి సలుపువారు వారికి సూచింపనను, యావద్భారత గ్రంథాలయసంఘము నొకదాని నేర్పరచుట తప్ప మరేమియు ఆసభవారు చేయజాలరైరి.

## ద్వితీయప్రయత్నము ఆరంభించినది.

1919 సం॥ నవంబరు మాసమందు చెన్నపట్టణములో జరిగిన ఆంధ్రగ్రంథాలయ మహాసభతో పాటు, బరోడా సంస్థానములో గ్రంథాలయ శాఖాధ్యక్షులగు శ్రీ కీర్తిశేషులైన, జే. యస్. కుడల్ కారు గారి అధ్యక్షతక్రింద యావద్భారత గ్రంథాలయ మహాసభను ఆంధ్రులు జరిపిరి. ఈమహాసభకు వివిధరాష్ట్రములనుండియు, స్వదేశసంస్థానములనుండియు, ప్రతినిధులాహ్వానింపబడిరి. ప్రభుత్వమువారు నగరములందుండువారి గ్రంథాలయ ప్రతినిధులను, సంస్థానములవారు వారి ప్రతినిధులను పంపిరి. మహాసభ జయప్రదముగ జరిగినది. దేశమందు గ్రంథాలయవ్యాపకమును గూర్చి యోగ్యతగల పండితులచే వ్యాసములు చదువబడెను. తీర్మానములు గావింపబడెను. చేసినపని దినదినాభివృద్ధిగాంచుటకు యావద్భారత గ్రంథాలయ సంఘమొకదానిని యేర్పరచవలెనని తీర్మానించిరి. ఈతీర్మానములను అమలులో పెట్టుటకును నియమనిబంధనలను తయారుచేయుటకును ఒక తాత్కాలిక సంఘము నేర్పాటుచేసిరి. నిబంధనపత్రములు తత్సంఘసభ్యులకు పంచిపెట్టబడిన తర్వాత యావద్భారతసంఘమేర్పడెను. కాని మనదురదృష్టవశముచే సంఘాధ్యక్షులైన కుడల్ కారు గారు హఠాత్తుగా మరణించుటవలన, యావద్భారత సంఘమువారు ఉద్యమముపట్ల యేమియు చేయలేదు.

పిమ్మట దర్భంగసంస్థానపు భాండాగారికులగు ఎస్. సి. గుహ ఠాకూరుగారు దేశీయమహాసభకు ఒక గ్రంథాలయ ముండవలయుననియు, జాతీయవిద్యయందీయుద్యమమును ముఖ్యాంతర్భాగముగచేసి వ్యాపింపజేయ

వలయుననియు సూచించుచు ఒక వ్యాసమును వార్తాపత్రికలలో ప్రచురించిరి. గయలో మణిలాల్ భాండాగారికులగు సూర్యప్రసాద మహాజన్ గారు దేశీయమహాసభతోపాటు యావద్భారత భాండాగారికుల మహాసభను గయా కాంగ్రెసుతోపాటు జరుపుటకు ప్రయత్నించెను. కాని ఆప్రయత్నము సఫలముగాలేదు.

ఇట్టి స్థితియందు కాకినాడపట్టణమున కాంగ్రెసు సభ జరిగినప్పుడు, ద్వితీయ అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభను ఆంధ్రులే సమకూర్చిరి.

కాకినాడ సభయందు మహారాష్ట్రదేశమునుండి వచ్చిన ప్రతినిధులు ముందుసభను మహారాష్ట్రదేశమునకు ఆహ్వానించిరి. కాని వారు ఇపుడాసభను చేయజాలకుండుటచే మూడవ అఖిలభారత గ్రంథాలయసభను బెల్గామునందు కాంగ్రెసు మహాసభ జరుగువారమునందు చేయుటకు తీర్మానించిరి. అందుచేత బెల్గామునందు తృతీయసభను ఏర్పాటుచేయవలసిన బాధ్యతగూడ మనమీదనే పడినది.

# శ్రీ వేటపాలెము హిందూయువజన సంఘము

పుణ్యనదులచేఁ గడుశోభితంబయ్యును, వేదశాస్త్ర పురాణ విద్యావివేక ప్రవరులచేతను, మహనీయ సత్య ధర్మపరాయణులైన శ్రీరామచంద్రాది మహారాజుల చేతను, ప్రసిద్ధిఁజెందిన దేవాలయములచేతను, ప్రఖ్యాతి వడసిన యన్నసత్రముల చేతను అలంకృతంబై, దాన ధర్మదయాసత్యశౌచముల కుత్పత్తిస్థానమై, ప్రాచీన నాగరికత కాలవాలమై, సమస్తదేశములకు సర్వవిషయములందు మార్గదర్శియై విరాజిల్లుచుండిన నిబ్భరతఖండము తన సహజ పూర్వవైభవోన్నతిని గోల్పోయి, సమస్తకళలు నశింప నిరుత్సాహసహితముగు ప్రస్తుత యభాగ్యస్థితి తలపైకెత్త, నిప్పుడిప్పుడు ప్రజలలో స్వయంసహాయభావముద్భవిల్లి, స్వధర్మ నిర్వహణార్థము నూతన ధైర్యస్థైర్య సాహసోత్సాహములు ముప్పిరిగొనంగ, దేశహితైక సకలధర్మ సంస్థాపన లుత్పన్నములగుచున్నతఱి, దేశముయొక్క భావిభాగ్యోన్నతికి భాషాభివృద్ధి ప్రథమసోపానము గనుకను, అట్టి భాషాభివృద్ధికిఁ బ్రధాన సాధనములైనవియును, భావిస్థితులను నిర్ధారణ చేయుటయం దత్యంతావశ్యకములైనవియును గ్రంథాలయములు గనుకను ఈ వేటపాలెమునందలి యువజనబృందములో జనించిన స్వాభివృద్ధికై వాంఛయు, భాషాభిలాషయుఁ జిగిరింప మాతృభాషాయోషాలలామ నుచితరీతిని సేవఁజేయు నుత్సాహముతో నీ "హిందూయువజన సంఘము" సర్వజనరంజకముగా 1918 వ సంవత్సరమున సుస్థాపితముఁ జేయఁబడెను.

యువజను లీసుప్రసిద్ధ సరస్వతీనిలయమును ప్రతిష్ఠించినపుడు వారిహృదయమున లీనమైయున్న యభినివేశము తప్ప నితర సహాయమేమియు లేకపోయినను, దీక్షతో కృషిసల్పిన సంఘము సర్వజనామోదముఁ బడయకపోవునాయను నాశయే వారి నీకార్యనిర్వహణమునకు గడంగ ప్రోద్బలపరచినది.

సర్వజనోపయోగకరములగు పుస్తకభాండాగారము లేదేశమున నిక్కుటముగ వెలయుచుండునో ఆదేశము సకలకళలకు నెలవై, నాగరికతకుఁ దావలమై, యఖిలసంపదల కాలవాలమై, యత్యున్నతపదవి నధిష్ఠించియుండును. గ్రంథాలయములవలనఁగలుగు ప్రయోజనపరంపరల నెఱ్ఱఁగ గ్రహించియే ప్రజాపరిపాలనా సామ్రాజ్యములుగల పాశ్చాత్యులు తమతమ స్వదేశములందన్ని ప్రాంతములను పుస్తకాలయముల నెల్లెడల వెలయింపఁజేసి ప్రపంచమునందలి జాతీయులలో నెల్ల నాగరికాగ్రగణ్యులని విఖ్యాతినిబడసిరి.

అనేక శతాబ్దములకుఁ బూర్వము, పాశ్చాత్యనాగరికత యింకను తలయెత్తకమునుపు మన భరతఖండ మఖండసామ్రాజ్య వైభవంబులతోఁ దులఁదూగుచు ననేక పుస్తకాగారములకు నిలయమై వెలయుచుండెననియు, గాలవశమున రాజ్యము పరాధీనమైనకొలంది నవియన్నియు దర్గతిపాలై విలయము జెందెననియుఁ జరిత్రలవలనఁ దెలియనగును. అతిపవిత్రవంతమై, ప్రాచీనాధునిక కవిపుంగవు లనేకులకుఁ బుట్టినిల్లగు మన దేశమునందు బ్రజలకు జాతీయవిద్యాదాహము హెచ్చుచున్నకొలది నట్టి దాహాతిశయమును విధికృతముగా తీర్చగల గ్రంథాలయోద్యమము పునరుద్ధరింపఁ బడుచున్నది.

మహాశయులారా! భగవదాలయములను నిర్మించి, యందు విగ్రహములను స్థాపించినంతమాత్రమున బ్రయోజనము లేదు. ప్రాణప్రతిష్ఠ జేసినంగాని జనుల నాకర్షించు శక్తి యావిగ్రహములకు గలుగదు. అయ్యవి పుణ్యక్షేత్రములుగ జాలవు. ఆవిగ్రహములకు సందర్శనా

ర్వాతలేదు. గ్రంథాలయమన్ననో, గ్రంథసముదాయమే సరస్వతీదేవియొక్క యాకారము. వేదోపనిషదితిహాస, పురాణ, మహాకావ్య, నవలా, ప్రబంధాదుల వాగ్రహితగానమే యానలువరాణి వీణానాదము. గ్రంథపరిచయము గొనువారలే ఆ సరస్వతీదేవి నారాధించువారలు. ఆ విద్యాప్రదాయినీ సందర్శనాఫలిత మింతయని వర్ణింప నలవికాదు. గ్రంథములు విజ్ఞాననిలయంబులు. అంత్యరహితములు. మహనీయ మహాప్రభుప్రత్యామ్నాయములు. నిర్జనప్రదేశ మిత్రంబులు. మానసికదుఃఖాపనోదకంబులు. సరస్వతీ ప్రసన్న కటాక్షవీక్షణ జ్యోత్స్నామాత్రమున అజ్ఞానాంధకారము భేదింపబడును. జ్ఞానము స్వస్థితిని విశదీకరించును. స్వస్థితిపరిజ్ఞానము స్వాతంత్ర్యమునకు మూలాధారము. స్వాతంత్ర్యము దేశాభివృద్ధికి, జాతీయతాభివృద్ధికి ప్రధానమార్గము. అట్టి గ్రంథస్వరూపిణియగు సరస్వతీవిగ్రహము యువజనులచే నెలకొలుపబడినదిగాన నేతత్స్వరూపమునకు ప్రాణప్రతిష్ఠఁజేయు భాగ్య బాధ్యతలు మహాజనులకిప్పటికి గలిగినవి. ఈభాగ్యమెవ్వరి కబ్బునోకదా! ప్రతివానికిని లభించుట దుస్తరము. కాన మా ప్రార్థనల నంగీకరించి యీ సుప్రతిష్ఠ సరస్వతీనిలయమున కుదారభావముతో భూరిపిరాశులనొసంగి శాశ్వత పోషకులుగా గాని, ప్రధానపోషకులుగా గాని, రాజపోషకులుగా గాని చేరి యిమ్మహాకార్యనిర్వహణ భారము వహించి, ఉచితరీతిని తోడ్పడెదరని నమ్ముచున్నారము. ఇంతియగాక యీ సంఘభవనమునందు పురాణాదిక సత్కాలక్షేపములు నిరంతర మొనర్పనేర్పాటులుగూడ జరిపింప నుద్దేశించినారము. జాతి, మత, భాష, దేశ, చారిత్రిక విషయములను గురించిన ముఖ్యవిషయముల కన్నిటికి తగిన యవకాశములను గల్పించుచు నేతద్విషయికజ్ఞానమును ప్రజలలో నెలకొల్పుటకు ప్రయత్నించుటకూడ నీసంఘమువల ప్రధానోద్దేశ్యములలో నొక్కటి.

మాతృదేశమునకును, మాతృభాషకును గలిగిన కళంకము దొలగుటకు సోదరజనులలో విజ్ఞానమును వ్యాపింపజేయనెంచి సర్వజనహితంబుగ స్థాపింపబడిన యీ హిందూయువజన సంఘమునకు స్వంతభవనమును మూలధనమును సమకూర్పదలచినారము. శాశ్వతపోషణార్థము రు 5000 లకు పైబడిన మూలనిధి యుండినగాని యీ యువజనసంఘము సర్వాంగములతో నిరంతరాయముగ జరుగుచుండ నేరదని మాకుఁ గలిగిన యయిదు సంవత్సరముల యనుభవముమీద నిర్ణయింపఁగలిగితిమి. అమిత ధనైకమూలమగు నీ మహాకార్య ముదారివంతుల తోడ్పాటుఁగాని నిర్వహింపఁబడనేరదు. అయిన నీమొత్తమార్జించుట యసాధ్యముకాదని మా దృఢనమ్మకము. ఒక్కరొక్కరే యీమొత్తము నీయసామర్థ్యముఁ గలవారలెందరో యీ గ్రామమునందు పురవాసులకెల్లర కియ్యది యొకభారము కాదని మా విశ్వాసము. గనుక మీరందరు నడుముగట్టుకొని కార్యభారము వహించి విరివిగ ధనసాహాయ్యము, గ్రంథసాహాయ్యము గావించి యితరులను ప్రోత్సాహపరచి మీచేనగురీతి మాకు జేయూత నొసంగి తోడుపడెదరుగాక యని వేడుచున్నారము. పరాత్పరుండు తమరీ సుకృతినొనర్ప నుదారసాహసము, త్యాగబుద్ధి తమకనుగ్రహించుగాక!

ఊటుకూరు వేంకటసుబ్బారావు,

కార్యదర్శి

# సంపాదకీయములు

## అఖిలభారత గ్రంథాలయ మహాసభ

## మూడవ సమావేశము

### జాతీయవారములో (డిశంబరుఆఖరువారములో) బెల్గాము పట్టణమున జరుగును

జాతీయవారము సమీపించుచున్నది. కర్ణాటక రాష్ట్రమందు చేరిన బెల్గామునగరమున జాతీయమహాజనసభతోపాటు అనేక అఖిలభారతసభలు జరుగును. అందు ఈసభ ప్రాముఖ్యతయందు ఇతరసభలకు తీసిపోవునది కాదు. భారతజాతీయ జీవనపునర్నిర్మాణ విధానమందు గ్రంథాలయోద్యమము ఆక్రమించు స్థానమును గూర్చి ఎంతచెప్పినను చెప్పవచ్చును. ఇందునుగూర్చి తిరిగిచెప్పుట చర్వితచర్వణముకాదు. ఈయుద్యమము ప్రజలను ఉద్రేకపూరితులనుగా చేయునదిగాక మెల్లమెల్లగా పటాటోపములేకుండునట్లు నిర్మాణాత్మకకార్యములను నేరవేర్చునది

యగుటచే నుత్సాహపూరితులగు యువకుల మనస్సును ఇతరోద్యమములు కొన్నియాకర్షించినంత తీవ్రముగా నాకర్షించలేదనుమాట సత్యము. రాజ్యాంగ సభలలో నేమి, లేక రణరంగమున నేమి, జరుపబడు సమరము చిరకాలమునుండియు ప్రజల నాకర్షించుచున్నది. కాని జాతియొక్క స్థైర్యముకొరకు ఆవశ్యకమగు శాంతియుతమైన విధానములు అట్లుచేయుటలేదు. ఒకగొప్ప తత్వవేత్త ఇట్లు ప్రశ్నించెను:— "ఈ ఇద్దరిలో ఎవరుగొప్పవాడు? ప్రపంచమునంతను రక్తప్రవాహములలో ముంచి అట్టి భీభత్సరంగమున తాండవమాడు సీజరుగొప్పయా లేక ఆడంబరములేక నెమ్మదిగా చెట్లు,పుట్టలు బాగుచేసి భూమిని ఫలవంతముగా చేసిన వ్యవసాయకుడు గొప్పయా?"

* * *

మంచికైననేమి చెడుగుకైననేమి ప్రతిమనుజుడును తనకుతానే ఇతరులపై నాధారపడకుండునట్లును, స్వయం సహాయముచేతను, తనజన్మస్థానముగానుండిన ఇతరుల అధికారమునకు లోబడినట్టియు ఇతరులపై అధికారము చెలాయించనట్టియు, పల్లెటూరునందు నివసించి జీవితమును గడుపుటకువీలగు పరిస్థితులన్నియు సంపూర్ణముగా మారిపోయినవి. ఆధునిక ప్రజాస్వామిక తత్వమునకు ఉచ్చాటనమంత్రములగు "స్వేచ్ఛ, సమత్వము, సర్వజన సోదరభావము" అనుమాటలు ప్రపంచముయొక్క నలుదెసలను మారుమ్రోగుచున్నవి. మన దేశపు జానపదులు కూడ తెలిసియైననేమి తెలియకయైననేమి సంపూర్ణ స్వాతంత్ర్యము స్వరాజ్యము అనుప్రవాహమునపడ దానిచే తరుమకొట్టబడుచున్నారు. ఈసంపూర్ణస్వాతంత్ర్యము యొక్కయు స్వరాజ్యముయొక్కయు తత్వము, ప్రజలకు సుబోధకము కానిచో వారందరు అరాజకము అవినీతి, దౌర్భాగ్యము పాలగుదురు. మరియు మనదేశమున వెంటనే తీర్మానమై తీరవలసిన సమస్యలు రాజకీయములు, సాంఘికములు, మతవిషయకములు, ఆర్థికములు — ఎన్నియోకలవు. వీని యన్నిటిని పరిష్కరించుటయందు ప్రజాసామాన్యముయొక్క తోడ్పాటును నిర్మాణశక్తియు ముఖ్యముగావినియోగించవలసియున్నది. జనసామాన్యమందరును దొరతనమువారిచే స్థాపింపబడు విద్యాలయముల యందు మెల్లమెల్లగా విద్యనభ్యసించి అటుపిమ్మట ఈసమస్యల పరిష్కారముకొరకు సహకారులు కావలయుననినయెడల అంతవరకును ఈపని అగునదికాదు.

* * *

గ్రంథాలయోద్యమమున అనంతమగుశక్తులు ఇమిడియున్నవి. కావున దేశాభిమానులు ఈయుద్యమమును చేపట్టి సరియైన మార్గమున నడిపినయెడల మన దేశాభివృద్ధికి అంతరాయములు కల్పించు అభ్యంతరము లెన్నియో నివారణకాగలవు. ప్రజల విజ్ఞానాభివృద్ధి అచిరకాలమున లభించును. ఈయుద్యమము నిర్దుష్టమగు నౌన్నత్యము పొందవలెనన్న దొరతనమువారి చేతులో కీలుబొమ్మ కాకూడదు. ఈయుద్యమ నిర్మాణకార్య విధానమంతయు ప్రజలచేతిలోనే యుండవలెను. ప్రభుత్వము వారు తమద్రవ్యము ఇందుకొరకై సహాయము చేయుచు తామిచ్చుద్రవ్యము సద్వినియోగమగునట్లు భద్రము చేసుకొనవచ్చును. హిందూపత్రికలో ప్రచురింపబడినట్లు—"ప్రజలకు స్వాభావికమగు ధర్మశీలత ఈయుద్యమ ప్రచారణకొరకు సంపూర్ణముగా వినియోగము కావలెను. దేశమంతటను వ్యాప్తమైయున్న విద్యాభివృద్ధిని చేయునట్టియు, జాతీయసౌధ నిర్మాణమునకు సాధన భూతమగునట్టియు ప్రతిష్ఠాపనలన్నియు ఇందుకొరకై కృషి చేయవలెను."

* * *

జిల్లాములలో సభజరుపుటకు ప్రత్యేకము ఆహ్వానసంఘమేర్పడువరకు ఇందునుగూర్చిన ఏర్పాట్లన్నియు బెజవాడయందున్న అఖిలభారత గ్రంథాలయసంఘ కార్యస్థానమునుండియే జరుగును. సభ యేతేదీలను జరుగునదియు ముందుప్రచురింపబడును. ఈసభ చాల ముఖ్యమైనది. ఈయుద్యమము దేశమంతటను వ్యాప్తినొందించుటకు తగిన కార్యక్రమము ఈసభయందు స్థిరపర్చబడును. కావున ఉద్యమాభిమానులందరును తాము ఉపన్యాసములను చదువనిశ్చయించినచో ఆయావిషయములను తీర్మానములను సభలో ప్రవేశపెట్టనెంచినచో ఆవిషయమును బెజవాడకు సంఘకార్యస్థానమునకు వెంటనే తెలుప ప్రార్థితులు.

* * *

## సంచారగ్రంథాలయములు.

### స్థానికసంఘములు

కడచిననెలలో బందరుతాలూకాబోర్డువారు తమ బోర్డులోచేరిన గ్రామములయందు సంచారిగ్రంథాలయములను స్థాపించి తన్మూలమున పల్లెటూరువారికి జ్ఞానాభివృద్ధిచేయుటకు తీర్మానించి అందుకొరకై రు 500-0-0 వినియోగపరచుటకు నిశ్చయించిరి. బందరుతాలూకా

బోర్డువారు ప్రారంభించినపని చాలాముఖ్యమైనదియు అత్యవసరమైనదియునని వేరుగా చెప్పనక్కరలేదు. ఇప్పుడు మనదేశమున కోమలవయస్సుగలిగి పాఠశాలలకు వెళ్లుటకు అనువగు వయస్సుగలవారు విద్యాభివృద్ధి నొందుటకు తగునట్లు పాఠశాలలు స్థాపించుటకుతోడు ఈడుముదిరినవారి జ్ఞానాభివృద్ధికొరకు తగిన ఏర్పాటులేమియు లేవు. మనదేశమున స్వపరిపాలన వెంటనే మనకు సిద్ధించవలయునని కోరుచున్నాముగదా. అప్పుడు ప్రజాసామాన్యమందరును తగినజ్ఞానవంతులై తమవిధ్యుక్తధర్మములను నెరవేర్చుటకు సమర్థులైయుండవలెను. అందులో ముఖ్యముగా స్థానికస్వపరిపాలనసంఘములు పల్లెటూరివారిచేతులలో నుండవలెను. వానికి సభ్యులనువెన్నుకొను వోటర్లు పల్లెటూరువారు. వారినుండియే సభ్యులనువెన్నుకొనుట భావ్యము. ఇప్పుడు కొంతవరకు అట్లేజరుగుచున్నది. ఈవిధముగా ఎన్నుకొను సభ్యులు తమవిధ్యుక్తధర్మములను నెరవేర్చుటకు తగినజ్ఞానము పల్లెటూరు సామాన్యజనులకు లేదని చెప్పుట సాహసము కాదు. అజ్ఞానము లభించుటయెట్లు? ఈ ఈడుముదిరినవారు నూతనముగా పాఠశాలలకువెళ్లి చదువుకొనుటకు వీలులేదుగదా. అట్లు వెళ్లినను అక్కడ బోధించుపాఠములకును వీరికి కావలసిన జ్ఞానమునకును అన్యోన్యసంబంధము లేదు. కావున ఈడుముదిరినవారికి తగినజ్ఞానము వృద్ధిపరచు సావకాశము గ్రంథాలయములకే కలదు. ఈగ్రంథాలయములు కొన్ని స్థిరమైనవి. కొన్ని సంచారముచేయునవి. ప్రతిగ్రామమందును స్థిరమైనగ్రంథాలయములు భరించగల పరిస్థితులు ఉండనేరవు. కావున ప్రతిగ్రామమువారికి అందుబాటులోనుండునట్లు సంచారగ్రంథాలయములను స్థాపించవలసియున్నది. ఇంకొకవిశేషమున్నది. మనతెలుగుభాషకు తగినపోషణలేక సరియైనగ్రంథములు ఇందు వెలువడుటలేదు. దేశభాషలయందు అన్నిశాఖలవిజ్ఞానమును గూర్చినగ్రంథములు ప్రచురింపబడినగాని ప్రజలందరును జ్ఞానవంతులు కారుగదా. అట్టిపుస్తకములు వెలువడుటకు గ్రంథకర్తలకు ఎక్కువప్రోత్సాహము కావలసియున్నది. ప్రస్తుతస్థితిలో దేశభాషలలో గ్రంథములరచించు గ్రంథకర్తలదుస్థితి మిక్కిలి శోచనీయము. వీరిలో చాలమంది పేదవారు. వేరే గ్రంథమువ్రాయుటకు తగినపరికరములను ఎక్కువ వ్యయప్రయాసలకోర్చి నసంపాదించుకొనవలెను. వారేపుస్తకముల అచ్చుఖర్చు భరించుకొనవలెను. పుస్తకములు వారే నెత్తినపెట్టుకొని దేశమంతటను తిరిగి అమ్ముకొనవలయును. ఇతరదేశములలో ఇట్లుకాదు. పుస్తకములు ప్రచురణచేయుటకు ప్రత్యేకముగ విరివిగా పెట్టుబడితో వ్యాపారము చేయు ప్రతిష్ఠాపనలేర్పడియుండును. ఆప్రతిష్ఠాపనలయధికారులు గ్రంథకర్తలవద్ద గ్రంథములుకొని ప్రకటింతురు. మనదేశమున ఇంగ్లీషువారిచే స్థాపింపబడిన ప్రతిష్ఠాపనలిట్టివి పెక్కుకలవు. మాక్ మిలన్ కంపెనీవారు లాంగ్ మన్ గ్రీన్సుకంపెనీవారు ఇట్టివారే. వీరు దొరతనమువారు అంగీకరించి వారిచే పాఠశాలలయందుచదువుటకు పాఠపుస్తకములుగా ఏర్పరచబడిన గ్రంథములనుగాని ప్రకటించరు. జనసామాన్యమునకు స్వపరిపాలనకు సంబంధించినట్టియు, దేశాభివృద్ధికి సంబంధించినట్టియు జ్ఞానమలవరచేయుగ్రంథములను ఈకంపెనీవారు ప్రకటించుటలేనేలేదు. ఇట్టిగ్రంథప్రకటన ప్రోత్సాహముచేయుబాధ్యత ప్రజలపైనున్నది. ఎక్కువ పుస్తకములనుకొని గ్రంథకర్తలకు ప్రోత్సాహముకల్గచేసినగాని మంచిపుస్తకములు వెలువడవు. మంచిపుస్తకములు వెలువడినగాని ప్రజలు ఎక్కువగా పుస్తకములు కొనరు. ఈ రెంటికిమధ్యనుండు సంధికాలమున మనమిప్పుడున్నాము. కాబట్టి స్థానికస్వపరిపాలకసంఘములు ఈతరుణమున భాషాభివృద్ధికి తోడ్పడవలసియున్నది. మనఆంధ్రదేశమందలి స్థానికస్వపరిపాలకసంఘములు ఈపని పూనినయెడల భాషాభివృద్ధి అచిరకాలమున లభించును. తపస్థానికసంఘమును సంవత్సరమునకు సంచారగ్రంథాలయములు స్థాపించుటకుగాని స్థిరమగు గ్రంథాలయములకు పుస్తకములు కొనుటకుగాని రు 500 లు చొ॥ వెచ్చించినయెడల గ్రంథకర్తలకు ఎక్కువ ప్రోత్సాహముకలిగి మనదేశప్రస్తుత పరిస్థితులకు అవసరమగు గ్రంథములు ఎన్నియో వెలువడును. పాఠశాలలకు వెళ్లు తరుణవయస్కులేగాక ఈడుముదిరినవారుకూడ జ్ఞానాభివృద్ధిచేసుకొను సాధనములేర్పడును. పల్లెటూరువారును బస్తీలవారును, విద్యాభివృద్ధిచే విజ్ఞానమును పొందినవారై స్వపరిపాలనను సక్రమముగా నిర్వర్తించుటకు తగిన శక్తివంతులగుదురు. కావున స్థానికస్వపరిపాలకసంఘమువారు ఈయుద్యమమును చేపట్టి తగుసహాయము చేసి మాతృభూమికి అభ్యుదయమును తెచ్చుటకు ప్రార్థితులు.

RSVM01A125



## అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

1924 సంవత్సరము డిశంబరు నెల ఆఖరువారమున, కర్నాటకరాష్ట్రమునందున్న "బెల్గాం" పట్టణమునందు జరుగును. కావున ఆంధ్రగ్రంథాలయములనుండి ప్రతినిధులు విరివిగా విచ్చేయుదురని ప్రార్థించుచున్నారము.

---


## మీ కేపుస్తకము కావలసినను

# వేంకటరామ్ కంపెనీ.

## పుస్తకముల షాపు

# బెజవాడ

## అనివార్యమవలెను

---

# ఫ్రెండ్స్ కంపెనీ, బెజవాడ.

## మా కంపెనీ క్రొత్తడాబా కోసికి మార్చబడినది

అన్నివస్తువులు సరసమైన ధరలకు కావలయుననిన ఫ్రెండ్సు కంపెనీ కొకసారి దయచేయుడు. ఫౌంటెన్ పేనాలకు, తలనూనెలకు, సెంటులకు, తెలుగు పుస్తకములకు, సిగారులైటరులకు, యెలెక్ట్రికు దీపములకు, లేసులకు, పన్నీరుబుడ్లకు, గ్లాసుసామానులకు ఫ్రెండ్సు కంపెనీకే వెళ్ళుడు.

---

# తొట్టివైద్యము.

కూనెగారి "అభినవ వైద్యశాస్త్రము, ముఖవైఖరీవిద్య, రోగారోగ్యవివేకము. శిశుపోషణ" అను 4 గ్రంథములలోని సంగతులన్ని సులభశైలిని వ్రాయబడినవి. తొట్టిస్నానములను గురించి వేఱొక గ్రంథము చదువనక్కరలేదు. 7 సంపుటములు. 36 అధ్యాయములు. 400 పుటలు. చక్కని బైండు. వెల 3—0—0 (ప్రకృతి చందాదారులకు 2—8—0) అడ్రెసు:— మేనేజరు,
ప్రకృతి ఆఫీసు, బెజవాడ.


---

ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్ (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యగారిచే ముద్రించి ప్రకటింపబడినది.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 125 |
| పుస్తకం పేరు | గ్రంథాలయ సర్వస్వము |
| తారీఖు | 7/6/14 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 25 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 9, 10, 23 |
| లేని పేజీలు | |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనిది | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |